క్లుప్తంగా

విగ్రహం ప్రతిష్టించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న వైశ్యభవన్ బైపాస్ చౌరస్తాలో స్వాతంత్ర్య సమరయోధులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ప్రతిష్టించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహసాధన సమితి, జిల్లా పద్మశాలీ సంఘం నాయకులు బుధవారం శాసనమండలి సభ్యులు ఎల్.రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్టాపనకు తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొండలక్ష్మణ్ బాపూజీ విగ్రహసాధన సమితి నాయకులు బండి మల్లిఖార్జున్, వేముల రమేష్, నల్ల నాగేంద్రప్రసాద్, అంకం వాసు, చింతకింది తిరుపతి పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ జిమ్ పనులు ప్రారంభం

నస్పూర్: పట్టణ పరిధిలోని 13వ వార్డులో రూ.50లక్షల నిధులతో చేపట్టిన చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వార్డు నాయకులు ఎర్ర అశోక్, యూత్ అధ్యక్షుడు నరేశ్, మాజీ ఎంపీటీసీ వడ్లూరి పోచమల్లు, పులి రాజేందర్, సిద్దం లింగయ్య, శ్రీనివాస చారి, అప్పారావు, దేవన్న, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అడ్మిషన్లు ప్రారంభం

దండేపల్లి: స్థానిక కేజీబీవీలో 2023–24విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, పాఠశాల ఎస్వో మంజుల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40సీట్లు, 7వ తరగతిలో 10, 8లో 12, 9లో 10సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

నేడు సన్నాహక సమావేశం

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల నిర్వహణ కోసం గురువారం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. బెల్లంపల్లి మండలం కన్నాలలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10–30గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల బాధ్యులు సమావేశానికి సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పౌర హక్కులపై అవగాహన

దండేపల్లి: మండలంలోని నంబాలలో పౌర హక్కులపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు అంజన్న మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: స్థానిక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో విందు, వినోదాలు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. అధికార దుర్వినియోగానికి పాల్పడి మున్సిపల్ కార్యాలయంలో విందు భోజనాలు నిర్వహించడం సిగ్గు చేటన్నారు. పురప్రజల సౌలభ్యం, పరిపాలన కోసం మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించగా అధికారులు ప్రైవేట్ కార్యక్రమాలకు వినియోగించడం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపల్ కార్యాలయాన్ని ప్రైవేట్ కార్యక్రమానికి వినియోగించడానికి కారణమైన మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేతలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అర్చకుడికి సన్మానం



పాతమంచిర్యాల: యాదాద్రి లక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహ్మచారిని బుధవారం మంచిర్యాల మారుతినగర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోట శ్రీనివాస్ పటేల్ సన్మానించారు. హైదరాబాద్‌లోని బ్రాహ్మణపల్లిలో రూ.25కోట్లతో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సంఘం సదనం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఆశీర్వాదం తీసుకుని సత్కరించారు.

రహదారి వివాదంపై గంటన్నర చర్చ

- వాడీవేడిగా మంచిర్యాల మున్సిపల్ సమావేశం
- సాదాసీదాగా పలు అభివృద్ధి పనులకు తీర్మానం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజయ్య

మంచిర్యాలక్రైం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. బెల్లంపెల్లి చౌరస్తా సమీపంలోని మెడిలైఫ్ వైపునకు వెళ్లే రహదారి వివాదంపై గంటన్నర పాటు చర్చించారు. ఆరు నెలల క్రితం బెల్లపెల్లి చౌరస్తా సమీపంలో మెడిలైఫ్ బైపాస్ రోడ్డువైపునకు వెళ్లే రహదారి విస్తరణ కోసం ఓ ప్రైవేటు వ్యక్తికి చెందిన భూమిని 18వందల 15గజాల స్థలాన్ని రూ.6కోట్లకు కొనుగోలు చేసేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానించగా, కొందరు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేసి అడ్డుకున్నారు. ఇటీవల బెల్లంపెల్లి చౌరస్తాలో ఐలాండ్ ఏర్పాటు చేయడంతో, ఎలాగైన రోడ్డు విస్తరణలో భాగంగా భూమిని అధికారుల తీసుకుంటారని తెలిసి, భూమి యజమాని తన భూమిలో సిమెంట్ పోల్ వేసి ఫెన్సింగ్ వేశాడు. దీంతో కౌన్సిలర్లు సమావేశంలో డబ్బులు చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు. నాడు కమిషన్ల పంపిణీలో విబేధాలు రావడంతో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లే అడ్డుకున్నారని పలువురు కౌన్సిలర్లు వాదించడం గమనార్హం. అనంతరం ఎజెండా అంశాలు ప్రస్తావించకుండానే పలు అభివృద్ధి కార్యక్రమాలకు తీర్మానం చేశారు. వివిధ వార్డుల్లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.180.85లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. తైబజార్ వేలం 2023–2024కు బహిరంగ వేలం నిర్వహించగా అనుమాల నాగేష్‌కు రూ.13,00,000కు ఇచ్చేందుకు తీర్మానం చేశారు. అనాథ శవాల ఖననం చేసేందుకు ఖర్చులకు 2023–2024కు గాను రూ.1లక్ష, తెలంగాణ అవిర్భావ వేడుకల నిర్వాహన కోసం అంచనా ఖర్చు రూ.87వేలు పరిపాలన మంజూరుకు కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముకేష్‌గౌడ్, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, ఇంజనీర్ మధుకర్, టౌన్‌ప్లానింగ్ అధికారి సత్యనారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా నస్పూర్ మున్సిపల్ సమావేశం



పాల్గొన్న చైర్మన్, కమిషనర్

నస్పూర్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంజెండాలో పొందుపరిచిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన 42అంశాలను సభ్యులు అందరూ చర్చించి, ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సి పల్ కమిషనర్ తన్నీరు రమేశ్, పలువురు కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పొగాకుతో ఎన్నో అనర్థాలు



జన్నారం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

బెల్లంపల్లి: పొగాకుతో ఎన్నో రకాల అనర్థాలు ఉన్నాయని బెల్లంపల్లి శాఖ బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి పద్మ అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పురప్రజలకు బుధవారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొగాకు నమలడం, సిగరేట్, బీడీ త్రాగడం వల్ల అనర్థాలు అధికంగా ఉంటాయన్నారు. శారీరకంగా, ఆర్థికంగా నష్టపోవాల్సి ఉంటుందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పొగాకుకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ కైవల్య, స్థానికులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలో పొగాకు వ్యతిరేఖ దినోత్సవ ర్యాలీని బుధవారం వైద్యశాఖ సిబ్బంది నిర్వహించారు. మండలంలోని తపాలపూర్‌లో వైద్య సిబ్బంది ర్యాలీ తీసి పొగాకు ఉత్పత్తులతో జరిగే అనర్థాలను వివరించారు. పొగాకు, అంబర్, సిగరేట్ వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాదులు ప్రబలే అవకాశం ఉందని, పొగాకు సంబంధిత ఉత్పత్తులను వాడొద్దని వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సందీప్, కమలాకర్, అపరంజి, లలిత, విజయ పాల్గొన్నారు.

భీమారం మండలసభ వాయిదా



హాజరైన ఎంపీడీవో, తహసీల్దార్

భీమారం: మూడు నెలల క్రితం నిర్వహించిన మండల సమావేశం కోరం లేక వాయిదా పడగా, బుధవారం నిర్వహించాల్సిన మండల సమావేశం కూడా కోరం లేక వాయిదా పడింది. సభకు ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ప్రకటించారు. కొత్తగా ఏర్పడ్డ భీమారం మండల అభివృద్ధి కోసం మండల సభ కృషి చేస్తుందని అందరూ భావించినప్పటికీ, అందుకు భిన్నంగా పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎంపీటీసీలు వారికి నచ్చిన సమయంలో సభకు వస్తున్నారు. మండలంలో మొత్తం నాలుగు ఎంపీటీసీ స్థానాలు ఉండగా, మద్దికల్ ఎంపీటీసీని ఎన్నికల సంఘం అనర్హుడిగా ప్రకటించడంతో ఆ స్థానం ఖాళీ ఆయింది. మిగితా ముగ్గురు కొనసాగుతున్నారు. అందులో ఎంపీపీ చెర్కు దీపికారెడ్డి, కాజిపల్లి ఎంపీటీసీ పెద్దల రూప, భీమారం ఎంపీటీసీ చేకూర్తి సరోజన ఉన్నారు. అయితే సమస్యల తీర్మాణాల అనంతరం వాటిని ప్రభుత్వానికి పంపించాల్సిన అవసరం ఉండగా, తరుచూ ఉన్న ముగ్గురిలో కొందరు గైర్హాజరు అవుతుండటంతో సభ జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్నిసార్లు ఒక్క సభ్యురాలు మాత్రమే సభకు వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వవిప్ బాల్కసుమన్ తన సొంత మండలం అని పలుమార్లు ప్రకటించారని, అయితే సభ నిర్వహణ విషయంలో ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కోరం సభ్యులు సభ నిర్వహణ చేపట్టి, ప్రజల సమస్యలు పరిష్కరించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సాదాసీదాగా చెన్నూర్ మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ మంత్రి బాపు

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్ అలీ, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి'

వేమనపల్లి: ఎలాంటి తరుగు లేకుండా, ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంతో పాటు దస్నాపూర్, మంగెనపల్లి డీసీఎంఎస్, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. నెల రోజులుగా గోదాంల వద్ద లారీలు అన్‌లోడ్ కాకుండా, కొనుగోళ్లు లేకుండా రైతులు వేచి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు రూ.10కిలోలు తరుగుపేరుతో కోత విధించడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. త్వరితగిన ధాన్యం కొనుగోలు జరగాలంటే, ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం కావాలని సూచించారు. రైస్‌మిల్లర్లు లారీ యజమానులతో చర్చలు జరిపి, కొనుగోలు చేయాలన్నారు. వారి వెంట సీపీఐ మండల కార్యదర్శి పురుషోత్తం, చిన్న శంకర్, మహేష్, హన్మంతు ఉన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

కోటపల్లి: మండలంలోని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు ఏవో మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగా 30కిలోల బ్యాగు రూ.843 అని తెలిపారు. వేసవి దుక్కుల తర్వాత విత్తనాలు వేసి, పూతకు రావడానికి ముందు పొలంలో కలియ దున్నుకుంటే నేలకు మంచి పాటుగా ఉంటుందని వివరించారు రైతులు పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ సమర్పించి సబ్సిడీపై విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మందమర్రి మండల సమావేశం

మందమర్రిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. మండల స్థాయి అధికారులు మూడు నెలల అభివృద్ధి ప్రణాళికను సమావేశంలో తెలియజేయగా, సభ్యులు పలు సమస్యలు ఎంపీపీ గుర్రం మంగ ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ లౌడమ్ రాజ్‌కుమార్, ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకూ కాంగ్రెస్'

దండేపల్లి: మండలంలోని లక్ష్మీకాంతపూర్‌లో బుధవారం గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కాంగ్రెస్ డిక్లరేషన్ గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్నారు.

సంబురాలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 5న సింగరేణి సంబురాలు నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్కే7 గనిపై బుధవారం నిర్వహించిన సమావేశంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ సాధించిన తర్వాత సింగరేణి ఎంతో అభివృద్ధి గడించిందని, కార్మికులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 5న గనులపై ప్రగతి మైదానంలో సంబురాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గనులపై కార్మికులకు స్వీట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కారుణ్య ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలు మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ జరుగుతుందన్నారు. సమావేశంలో గ్రూప్ ఏజెంట్ మాలోత్ రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్, పిట్ ఇంజనీర్ ప్రవీణ్, సంక్షేమ అధికారి శంతన్, టీబీజీకే పిట్ సెక్రెటరీ మెండ వెంకటి పాల్గొన్నారు.

డిప్యూటీ సూపరింటెండెంట్‌కు వీడ్కోలు

శ్రీరాంపూర్: జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో రిటైర్డ్ అయిన డిప్యూటీ సూపరింటెండెంట్ రాళ్లబండి రాజన్నను సన్మానించి వీడ్కోలు పలికారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జీఎం సంజీవరెడ్డి ఆయన్ను శాలువాతో సత్కరించి కంపెనీలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, డీజీఎంలు అరవింద రావు, చిరంజీవులు శివరావు డీవైపీఎం రాజేశ్వర రావు, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

డైరెక్టర్‌ను కలిసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

శ్రీరాంపూర్: సింగరేణి డైరెక్టర్ (పర్సనల్) ఎస్.బలరాంను గోదావరిఖని ఇల్లందు గెస్ట్ హౌస్ లో బుధవారం సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన ఆర్‌ఓఆర్ అమలు, పదోన్నతులపై చర్చించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఏరియా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, కో కన్వీనర్ సుమన్, నాయకులు రెడపాక లక్ష్మణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

కాసిపేట గనిపై సన్మానం

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేటగనిపై ఉద్యోగ విరమణ పొందిన యాక్టింగ్ వెల్డర్ గోదార్ల శంకర్ దంపతులను బుధవారం గని అధికారులు, యూనియన్ నాయకులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాగం మల్లేష్, టీబీజీకేఎస్ నాయకుడు వోడ్నాల రాజన్న, రక్షణాధికారి సునిల్ కుమార్, సంక్షేమాధికారి జీశాన్, ఫిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మెన్‌జా' బట్టల షోరూం ప్రారంభం



ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, విజిత్‌రావు, తదితరులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్‌లో మెన్‌జా మెన్స్ అండ్ బాయ్స్ బట్టల షోరూంను బుధవారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, నడిపల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విజిత్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యమైన బ్రాండెడ్ దుస్తులు చిన్నపిల్లల నుంచి పెద్దవారికి టీ షర్టులు, జీన్స్ అతితక్కువ ధరలకే అందుబాటులో ఉన్నాయన్నారు. బ్రాండెడ్ దుస్తుల కోసం హైదరాబాద్ లాంటి పట్టణాలకు వెళ్లకుండా, జిల్లా కేంద్రంలోనే అందుబాటులో ఉన్నాయన్నారు. సామాన్యులకు సైతం నాణ్యమైన అన్ని రకాల వెరైటీ దుస్తులు తక్కువ ధరలకు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు విశ్వనాథ్, బాలకిషన్, రవికుమార్, వినోద్‌కుమార్, విజయ్‌కుమార్, సాయికుమార్, అశ్విన్, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో కార్పొరేట్ వైద్యసేవలు

- జిల్లా కేంద్రంలో నూతనంగా 'సిద్ధి' స్కిన్‌కేర్‌ఈఎన్‌టీ ఆసుపత్రి ప్రారంభం



ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య

పాతమంచిర్యాల: సామాన్య ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు మంచిర్యాల పట్టణంలో అందుబాటులోకి వచ్చాయని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద బుధవారం సిద్ధి స్కిన్ అండ్ ఈఎన్‌టీ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల, కుమురం భీం జిల్లాల ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో చర్మవ్యాధులు, చెవి, ముక్కు, గొంతు వైద్యసేవలను తక్కువ ఖర్చుకే అందించడానికి అనుభవం, అర్హతలు ఉన్న వైద్యులు సేవలందించడానికి ముందుకురావడం శుభపరిణామమన్నారు. వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, నడిపెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నడిపెల్లి విజిత్‌రావు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ, తానా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ సల్మాన్‌రాజ్, వైద్యులు ఎస్.మల్లేష్, ఆసుపత్రి యాజమాన్యం పిన్న ప్రశాంత్, రాజ్‌కుమార్, ప్రదీప్, సంతోష్, ప్రభంజన్, అజయ్, జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరీ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి తొగరి సుధాకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పల్లెలు అభివృద్ధి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జన్నారం: బీఆర్ఎస్ హయాంలో వెనుకబడిన పల్లెలు అభివృద్ధి చెందాయని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలోని చింతగుడలో బుధవారం 'ఇంటింటికీ రేఖక్క' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ రాజన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, డైరెక్టర్ జనార్దన్ బీఆర్ఎస్ నాయకులు సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఉదయ్‌కాంత్

బెల్లంపల్లిరూరల్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ కాంపెల్లి ఉదయ్‌కాంత్ అన్నారు. మండలంలోని ఆకెనపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి లారీలు రాక ఇబ్బందులు పడుతున్నామని రైతులు సూచించగా, ఉదయ్‌కాంత్ జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు ఫోన్‌లో సమస్యను వివరించారు. దీంతో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, కొనుగోలులో జాప్యం లేకుండా రెండు రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, స్థానిక నాయకులు ఉన్నారు.

'దశాబ్ది ఉత్సవాలు పండగలా నిర్వహించాలి'



దండేపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

దండేపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పండగలా జరపాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణ పై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 2 నుంచి 22వరకు నిర్వహించే కార్యక్రమాలను గురించి చర్చించారు. కార్యక్రమాల్లో అందరు తప్పక పాల్గొనాలన్నారు. ఎంపీడీవో మల్లేశం, ఏవో అంజిత్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శిరీష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమిని: దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జూన్ 22వరకు జరిగే రోజువారి కార్యక్రమాలపై చర్చించారు.

వేమనపల్లి: దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్ గాలి మధు సూచించారు. నీల్వాయి గ్రామపంచాయతీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సభ్యులకు సూచించారు. అభివృద్ధి పనులపై చర్చించారు.

తాండూర్: దశాబ్ది వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ ప్రణయ్‌కుమార్ సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. శాఖల వారీగా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, ప్రతి కార్యక్రమంలోనూ ప్రజలను భాగస్వాముల్నీ చేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే చిన్నయ్య జన్మదిన వేడుకలు



అనాథ పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి/నెన్నెల/కాసిపేట/తాండూర్: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమక్షంలో చిన్నయ్య కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు, ప్రభుత్వ శాఖల అధికారులు, అభిమానులు, వ్యాపార వాణిజ్య వర్గాలు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. బెల్లంపల్లిలోని అమ్మ అనాథ శరణాలయం చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు.

'పల్లెవెలుగు' ప్రారంభం

వేమనపల్లి: బెల్లంపల్లి మీదుగా జిల్లెడ, వేమనపల్లికి వచ్చే పల్లెవెలుగు బస్సు బుధవారం ప్రారంభమైంది. జిల్లెడ వద్ద సర్పంచ్ కొండాల్‌రెడ్డి బస్సుకు స్వాగతం పలికారు. బస్సు సర్వీస్‌తో బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కోటపల్లి మండలాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.